747) సాళంగనాట

ప॥ తిరువీధు లేగీని దేవతలు జయవెట్ట। హరి వాడె పెండ్లికొడుకై ప్రతాపమున॥

చ॥ కనకపుగొండవంటి ఘనమైన రథముపై। దనుజమర్దనుడెక్కె దరుణులతో।
వినువీధి బడగలు వేవేలు కుచ్చులతోడ। బెనగొనగ గదలె భేరులు మ్రోయగను॥

చ॥ వరుస జంద్రసూర్యుల వంటి బండికండ్లతోడ। గరుడధ్వజు డొరసీ గడు దిక్కులు।
పరగు వేదరాసులే పగ్గాలు వట్టితియ్యగ। సరుగ దుష్టుల గొట్టి జయము చేకొనెను॥

చ॥ ఆటలు బాటలు వింటా నలమేల్మంగయు దాను। యీటున శ్రీవేంకటేశు డెదురులేక।
వాటపుసింగారముతో వాకిటవచ్చి నిలిచీ। కోటానుగోటివరాలు కొమ్మని ఇచ్చుచును॥